నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 ఖమ్మం, మంగళవారం 27 ఆగస్టు 2024 BHADRADRI KOTHAGUDEM



# మాఫీ మెలికలపై ఆగ్రహం

- బ్యాంకులు, ఏఓల చుట్టూ తిరుగుతున్నా కనికరించరా..?
- జాబితాలో పేర్లు లేకపోవడంతో రైతుల ఆందోళన

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ విషయంలో ఇచ్చిన మాట తప్పడంపై రైతులు మండిపడుతున్నారు. విడతలవారీగా రుణమాఫీ చేస్తామని, అందరికీ మాఫీ వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే చెబుతున్నా.. ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని.. బ్యాంకులు, సొసైటీలు, వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే పనిగా పెట్టుకున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో సాగు పనుల్లో నిమగ్నం కావాల్సిన తాము కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని, రూ.2 లక్షల రుణమాఫీ కోసం ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. తీరొక్క విధంగా నిరసనలు తెలిపినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై ఏమాత్రం కనికరం చూపడం లేదని, రుణమాఫీ కాకపోతే తమ అప్పులు ఎలా తీరుతాయని అన్నదాతలు దిగులు చెందుతున్నారు. –నమస్తే నెట్‌వర్క్

### షరతులు, కొర్రీలు పెట్టొద్దు..



రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా బ్యాంకు అధికారులు మాఫీ చేయడం లేదు. మొదటి, రెండో విడతల్లో ప్రకటన చేసి కొందరు రైతులకు మాత్రమే మాఫీ చేశారు. ప్రస్తుతానికి రూ.2 లక్షల రుణమాఫీ కోసం అర్హులైన రైతులు బ్యాంకులకు వెళితే పేర్లు, ఆధార్ నెంబర్లు తప్పుగా ఉన్నాయి అని చెబుతూ అనవసర కారణాలు చెప్పి తిప్పి పంపిస్తున్నారు. అధికారులు ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి. వ్యవసాయ సీజన్ అయినందున ఇబ్బంది పెట్టకుండా వెంటనే రుణమాఫీ చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–గుగులోతు భద్రునాయక్, రైతు, పాండురంగాపురం, పాల్వంచ మండలం

### మాఫీ ఎందుకు కాలేదో చెప్పట్లేదు..



నేను ఆంధ్రా బ్యాంకులో రూ.1.60 లక్షల వ్యవసాయ రుణం తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన విధంగా నేను తీసుకున్న రుణం మాఫీ అయ్యిందో.. లేదో.. తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళితే అధికారులు కాలేదన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి అడిగితే.. రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పడం లేదు. తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లి కాయితాలు రాయించుకుని రా.. అని చెబుతున్నారు. సాగు చేసుకోవడానికి పంట భూముల వద్దకు వెళ్లాలో.. బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగాలో అర్థం కావడం లేదు. అంతా గందరగోళంగా ఉంది.

–రెడ్డి వెంకటేశ్వరరావు, రైతు, జమ్మిగూడెం, అశ్వారావుపేట మండలం

### రుణమాఫీ చేసి అండగా నిలవాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా చేయాలి. ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగు పనులు చేసుకునే రైతులందరి రుణాలు మాఫీ చేసి వారిని ఆదుకోవాలి. విడతలవారీగా రుణమాఫీ చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మనోవేదనకు గురవుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మాదిరిగా వ్యవసాయం పండుగలా సాగాలంటే.. ప్రస్తుత ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతు భరోసా ఇచ్చి రైతులకు అండగా నిలవాలి. లేదంటే రైతుల పక్షాన నిలిచి రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం.

–మూడ్ జయరాంనాయక్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకుడు, చుంచుపల్లి

## 'మాఫీ రైతులందరికీ వర్తింపజేయాలి'



మాట్లాడుతున్న ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి రామారావు

బోనకల్లు, ఆగస్టు 26 : షరతులన్నీ ఎత్తివేసి రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, పీఎంకేఎస్ నిబంధనలు, షరతులను ఎత్తివేసి రుణం తీసుకున్న రైతులందరికీ తక్షణమే మాఫీ అమలు చేయాలన్నారు. రూ.2 లక్షలకు పైగా అప్పు ఉండి మాఫీ కాని వారి కోసం ప్రత్యేక యాప్ అంటూ రైతులను మభ్యపెట్టేందుకు మరో ప్రయత్నం చేస్తోందని, దీంతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగలి ఆనందరావు, మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు బోళ్ల ప్రసాదరావు, కొంగర భాస్కర్‌రావు, గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'నేటి ధర్నాకు రైతులు తరలిరావాలి'

పెనుబల్లి, ఆగస్టు 26 : రూ.2 లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఉదయం 10 గంటలకు చేపట్టే ధర్నాకు రైతులు తరలిరావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మినేని సుధాకర్ కోరారు. లింగగూడెం గ్రామంలో సోమవారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ జిల్లాలో 30 శాతం మాత్రమే అమలు జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పెనుబల్లి పీఏసీఎస్ డైరెక్టర్ పద్దం జోగయ్య, శ్రీను, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

క్రీడా సంఘాల ప్రతినిధుల పిలుపు



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 26 : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడాకారులు ఆటల్లో రాణించాలని, పతకాలు సొంతం చేసుకోవాలని క్రీడా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక త్రీ ఇంక్లైన్‌లో గల తెలంగాణ క్రీడా ప్రాంగణంలో అండర్–14 జిల్లాస్థాయి రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీలను సీనియర్ కరాటే మాస్టర్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా.. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అనంతరం అంతర్జాతీయ మాజీ కరాటే క్రీడాకారుడు, రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాశీ హుస్సేన్ గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నిహారిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆదినారాయణ, మొగిలి, కే.శ్రీనివాస్, కృష్ణ, రామకృష్ణ, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. దీంతో రైతుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. ఇప్పటికే రైతువేదికలు, గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించగా టోల్‌ఫ్రీ, ప్రత్యేక సెల్ నెంబర్‌కు సైతం ఆన్‌లైన్‌లో అనేక ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా మూడ్రోజుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక ఫార్మాట్ ద్వారా రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అయినప్పటికీ అన్నదాతల ఆగ్రహజ్వాలలు చల్లారకపోవడంతో ప్రభుత్వం మరో రూటు ఎంచుకుంది. రేపటి నుంచి వ్యవసాయశాఖ సిబ్బందిని ఇంటింటికీ పంపించనున్నది. మొత్తం 8 రకాల అంశాలను సేకరించి కుటుంబ యజమాని సంతకంతోపాటు ఆ ఇంటి కుటుంబసభ్యులతో సెల్ఫీ సైతం దిగి ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. అయితే ఇది కేవలం కుటుంబ నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ మాత్రంగానే కనిపిస్తున్నది. కానీ అసలైన సాంకేతిక సమస్యల పరిష్కారంపై మాత్రం ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

- ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 26

- రుణమాఫీపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- దిద్దుబాటు చర్యలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇప్పటికే ఫిర్యాదుల స్వీకరణ.. రేపటి నుంచి హోం విజిట్
- కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- కేవలం కుటుంబ నిర్ధారణ కోసమే 'స్పెషల్ డ్రైవ్'
- సాంకేతిక సమస్యలపై మాత్రం స్పష్టత కరువు

# దిద్దుబాటు.. మరో రూటు



పంటల రుణమాఫీ ప్రక్రియపై పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యల్లో భాగంగా మరో దారి ఎంచుకుంది. రేపటి నుంచి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు ఇంటింటి సందర్శన చేయనున్నారు. గడిచిన నెలరోజుల నుంచి జిల్లాలో ఎక్కడ చూసినా రుణమాఫీపై రైతులు విరుచుకుపడుతున్నారు. కొంతమంది రైతులకు రుణమాఫీ కావడం, మరికొందరికి కాకపోవడంతో సదరు రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే తమకు పూర్తి అర్హత ఉన్నా పంటల రుణమాఫీ కాకపోవడంతో నిత్యం వందలాది మంది రైతులు మండల వ్యవసాయశాఖ అధికారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో తప్పొప్పులను సరిదిద్దేందుకు గాను ప్రభుత్వం ఇప్పటికే ఒక్కటి కాదు.. రెండు కాదు అనేక వేదికల ద్వారా ఫిర్యాదులను స్వీకరించింది. రైతువేదికల ద్వారా ఏఈవోలు ఫిర్యాదులు స్వీకరించగా, గ్రీవెన్స్ ద్వారా మండల, జిల్లా అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. అదేవిధంగా టోల్ ఫ్రీ, ప్రత్యేక సెల్‌నెంబర్‌కు సైతం ఆన్‌లైన్‌లో అనేక ఫిర్యాదులు పోటెత్తాయి. మొత్తంగా ఖమ్మం జిల్లాలో 20వేల పైచిలుకు ఫిర్యాదులు రావడం జరిగింది. తాజాగా గడిచిన మూడురోజుల నుంచి మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక ఫార్మాట్ ద్వారా ఫిర్యాదుల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయినప్పటికీ సమస్యలకు చెక్ పడకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వీకరించిన ఫిర్యాదులతోపాటు, ఉన్నతాధికారులు ప్రత్యేక జాబితాలను గ్రామాల వారీగా ఈ సైట్‌లో పొందుపరుస్తారు. ఈ యాప్ ముఖ్యఉద్దేశం కేవలం కుటుంబ నిర్ధారణ కోసమేనని తెలుస్తున్నది.

### కుటుంబ నిర్ధారణకు స్పెషల్ డ్రైవ్

జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు బుధవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్ర, శనివారాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రయోగాత్మకంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఏవోలు ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఒకటీ రెండు కుటుంబాల వివరాలను సేకరించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొత్తం 8 రకాల అంశాలను సేకరించారు. అదేవిధంగా కుటుంబ యజమాని సంతకంతోపాటు ఆ ఇంటి కుటుంబసభ్యులతో ఓ సెల్ఫీ సైతం దిగి అప్‌లోడ్ చేశారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియ ముగియడంతో ఇక ప్రత్యక్షంగా రంగంలోకి దిగనున్నారు. కేవలం కుటంబ నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ మాత్రమే చేపట్టనున్నారు. పంటల రుణాలు తీసుకున్నవారికి రేషన్‌కార్డులు లేని కుటుంబాలు, ఒకే ఇంటిలో ఒకే రేషన్‌కార్డులో తండ్రి, కొడుకు లేదా కూతురు కుటుంబసభ్యులు ఉన్నట్లయితే సదరు కుటుంబ సభ్యులను విడివిడిగా చూపెట్టాల్సి ఉంది. తద్వారా ఇరు కుటుంబాలకు రుణమాఫీ వర్తింపచేయనున్నారు. బీఆర్ఎస్ నాయకులు గత కొద్దిరోజుల నుంచి ఇదే అంశంపై పోరాటం చేస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి కుటుంబ నిర్ధారణ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. దీంతో నేడు లేదా రేపటి నుంచి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు.

### సాంకేతిక సమస్యల పరిష్కారంపై స్పష్టత కరువు

పంటల రుణమాఫీ కాకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కుటుంబ నిర్ధారణతోపాటు ఆధార్‌కార్డు నెంబర్, రుణగ్రహీతల పేర్లు, చిరునామాలు, ఇతర అనేక పొరపాట్లు దొర్లాయి. వీటిని సవరించాలని కోరుతూ రైతులు దరఖాస్తులు సైతం అందజేశారు. అయితే సాంకేతిక అంశాల విషయంలో వ్యవసాయశాఖ అధికారులకు ఇప్పటికీ స్పష్టత లేదని చెప్పవచ్చు. ఈ అంశాలను సరిదిద్దే అధికారం ఏవోలకు ఇస్తారా లేదా అనేది స్పష్టతలేదు. ఇకపోతే ఏవో లాగిన్‌లోనే కుటుంబ నిర్ధారణ జరుగుతుందా, ఏఈవోలకు సైతం లాగిన్ ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. వీటికి తోడు కుటుంబాలు వేర్వేరు అని గ్రామ పంచాయతీ సెక్రటరీ ధ్రువీకరణ చేస్తారా, రెవెన్యూ అధికారులకు బాధ్యత ఇస్తారా లేదా వ్యవసాయశాఖ అధికారులకే నిర్ణయం వదిలేస్తారా అనేది ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. కుటుంబ నిర్ధారణతోపాటు సాంకేతిక పొరపాట్లకు సైతం చెక్‌పెట్టని యెడల గ్రామాల్లో రైతులు మరింత ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఈ సందేహాల నివృత్తికి గాను మంగళవారం ఎంపిక చేసిన రైతువేదికల్లో 'రైతునేస్తం' పేరుతో అవగాహన కార్యక్రమం జరగనున్నది. దీంతో వీడియో కాన్ఫరెన్స్‌లోనే రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

### రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్





మాట్లాడుతున్న ఆవుల వెంకటేశ్వర్లు

కొణిజర్ల, ఆగస్టు 26 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. సింగరాయపాలెం, తీగల బంజర గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని, పంటల బీమా పథకం, రైతు పంటకు మద్దతు ధర ఉంటే క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని చెప్పిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు, డివిజన్ నాయకులు తడికమళ్ల సీతారాములు, మేడి కొండలరావు, కంకణాల పెద్దవెంకటి, చిన్నవెంకటి, నూనావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'






ప్రచార జాతా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల, ఆగస్టు 26 : ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాం బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ కోరారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీపై మంత్రులు రోజుకో ప్రకటన చేయడంతో రైతుల్లో గందరగోళం నెలకొన్నదన్నారు. తుది విడతకు గడువు ప్రకటించి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు అన్నారపు వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు యాసా తిలక్, సత్యం, రామారావు, సాంబశివరావు, సాయి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వాహా నిజమే!

- ఖమ్మంలో సీఎంఆర్ఎఫ్ నిధులు దుర్వినియోగం
- నకిలీ బిల్లులతో రూ.కోట్లు దండుకున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- సీఐడీ విచారణలో వెలుగు చూసిన అక్రమాలు
- యాజమాన్యాలు, వైద్యులు, సిబ్బందిపై కేసులు నమోదు?





ఖమ్మం సిటీ, ఆగస్టు 26: ఏదైనా రోగం వచ్చి ప్రైవేట్ ఆసుపత్రుల మెట్లెక్కితే చాలు.. వాటి యాజమాన్యాలు, వైద్యుల బృందాలు కలిసి రోగులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. అప్పటికీ ధన దాహం చల్లారక కాసుల కోసం వక్రమార్గాలను ఎంచుకుంటున్నాయి. ప్రభుత్వాలనే బురిడీ కొట్టిస్తూ రూ.కోట్లు దండుకున్నాయి. చివరికి తీగ లాగితే డొంక కదిలినట్లుగా అక్రమాలన్నీ బహిర్గతం అవుతుండడంతో గజగజా వణికిపోతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లాలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల బాగోతం గతంలోనే తెరమీదకు వచ్చింది. రోగులకు వైద్య సేవలు చేయకుండానే ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు తప్పుడు బిల్లులు సమర్పించారు. ఒకటీ రెండూ కాదు.. ఒక్కో దవాఖాన నుంచి నిరంతరం లక్షలాది రూపాయలకు సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం దరఖాస్తులు వస్తున్నాయి. అనుమానం రావడంతో హైదరాబాద్‌లో సంబంధిత శాఖ రెవెన్యూ విభాగం ఇన్‌చార్జి డీఎస్ఎన్ మూర్తి.. అక్కడి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు గతేడాది ఏప్రిల్‌లో ఖమ్మం వచ్చారు. విషయం బయటకు తెలియకుండా విచారణ జరిపారు. ఆ క్రమంలో దవాఖానల రిజిస్టర్లు, బిల్లులను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకున్నారు.

### అక్రమాలు నిజమే..!

జిల్లాలోని 10 ప్రైవేట్ ఆసుపత్రులు ముఖ్యమంత్రి సహాయనిధికి తప్పుడు బిల్లులు సమర్పించినట్లు సీఐడీ విచారణలో బహిర్గతమైనట్లు తెలిసింది. ఖమ్మంలో 9, బోనకల్లు మండలంలో ఒకటి కలిపి మొత్తం పది ఆసుపత్రుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు నిగ్గు తేల్చారని సమాచారం. వాటిల్లో శ్రీకర మల్టీ స్పెషాలిటీ, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ, జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, ఆరంజ్ హాస్పిటల్, మెగాశ్రీ హాస్పిటల్ (బోనకల్లు) సీఎంఆర్ఎఫ్ నిధులు స్వాహా చేసిన జాబితాలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, సిబ్బంది కుమ్మక్కై సర్కారు సొమ్మును కాజేసినట్లు వినికిడి. కాగా, రంగంలోకి దిగిన సీఐడీ.. అక్రమాల పుట్టను కదిలించి సేకరించిన ఆధారాల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినట్లు పలువురు అధికారులు వెల్లడించారు. త్వరలోనే రెవెన్యూ యాక్ట్ ప్రకారం ఆయా ఆసుపత్రులపై రికవరీ యాక్ట్ ప్రయోగించడంతోపాటు కారకులపై వివిధ రకాల సెక్షన్ల కింద కేసులు కూడా నమోదు చేయనున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, ఈ విషయాన్ని పసిగట్టిన ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు.. కేసుల నుంచి తప్పించుకునేందుకు ఇప్పటి నుంచే అధికార పార్టీ నేతలతో పైరవీలు చేయిస్తున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- కుల వృత్తిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



గౌడ కులస్తులకు కాటమయ్య కిట్లు అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు 26 : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతున్నదని, కుల వృత్తులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల 100 మంది గౌడ కులస్తులకు సోమవారం కాటమయ్య కిట్లు అందజేశారు. ముస్తాదు వేసుకున్న గౌడన్నలతో మంత్రి మాట్లాడి.. కిట్ల ఉపయోగం గురించి తెలుసుకున్నారు. కిట్లు ఎలా పనిచేస్తాయి.. వాటి వల్ల కలిగే ఉపయోగాల గురించి శిక్షకులు వివరించారు. కార్యక్రమంలో ఏసీ మధుసూదన్‌నాయక్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్డీవో గణేశ్, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డి, డీబీసీడబ్ల్యూవో జ్యోతి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 41 గ్రామ పంచాయతీల్లో గల ముఖ్య నాయకులతో వివిధ అంశాలపై మంత్రి చర్చించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు బేబీ స్వర్ణకుమారి, గురవయ్య, రవికుమార్, బాలకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, హఫీజుద్దీన్, దామోదర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఇతర మండలాల నాయకులు రామసహాయం నరేశ్‌రెడ్డి, జగదీశ్, ఆర్.అరవిందరెడ్డి, బెల్లం శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.